సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 9-1-2025
సంపుటి: 20 సంచిక: 244
పేజీలు: 4 వెల: రూ.1

## వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్‌గా కొంక్యాన మురళీధర్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్‌గా కొంక్యాన మురళీధర్ ఈ నెల 10న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ముళ్లపూడి ప్రభావతి చేతుల మీదుగా ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జెడ్పి సమావేశ మందిరంలో జరుగనుంది. కార్యక్రమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా ప్రస్తుత గవర్నర్ జామి నారాయణరావు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డాక్టర్ కిల్లంశెట్టి పాండురంగారావు, డాక్టర్ మధుకర్ విలేకర్, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొన్న వెంకటేశ్వరరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సలీమ్ షాక్, ఉపాధ్యక్షులు డాక్టర్ నాగేంద్రరావు, ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ రవిరాజు, వి.మురళీమోహన్, ఎస్.పి. రవీంద్ర, నేతాజీ సుబ్బారెడ్డి, ఇడుపూరి గున్నేశ్వరరావు, ఆర్.సి కర్రోతు సత్యం, చీఫ్ కో-ఆర్డినేటర్ జి.కృష్ణంరాజు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎస్.ఎస్.వి.ఆర్.ఎం. రాజు, ఎలక్ట్ గవర్నర్ తిరుపతిరావు హాజరుకానున్నారు. గౌరవ అతిధులుగా వాకర్స్ పూర్వ గవర్నర్లు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు హాజరుకానున్నారు.



- చైన్‌స్నాచర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
- ఎచ్చెర్లలో తేలిన మూలాలు
- ప్రైవేట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన టీడీపీ నాయకుడు
- ఇద్దర్ని తప్పించేసిన జీఆర్‌పీ

# 'గుప్త'ంగా తప్పించేశారు!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైల్లో చైన్ స్నాచింగ్ చేస్తూ రైల్వే పోలీసులకు చిక్కిన దొంగ ఇచ్చిన సమాచారంతో బంగారం రికవరీ చేసినా, బాధ్యులను మాత్రం విడిచి పెట్టేశారు. సుమారు ఏడు తులాల బంగారం రికవరీ చేసినట్టు రైల్వే పోలీసులు న్యాయస్థానానికి చూపించి కొందరు నిందితులను విడిచిపెట్టేశారని వెలుగులోకి వచ్చింది. రెండు నెలల క్రితం పలాస రైల్వేస్టేషన్ పరిధిలో నడుస్తున్న రైలులో నుంచి మహిళ మెడలో బంగారు గొలుసును దొంగిలించి నట్టు జీఆర్‌పీ ఎస్ఐ శ్రీనివాసు కేసు నమోదు చేసినట్టు తెలిసింది. విశాఖపట్నం జీఆర్‌పీ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన రైల్వేపోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నరసన్నపేటలో బీకాం ఫైనల్ ఇయిర్ చదువుతున్న యువకుడిని ఆమదాలవలస జీఆర్‌పీ అదుపులోకి తీసుకుంది. యువకుడిని విచారించి నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ఎచ్చెర్లలో 7 తులాల బంగారాన్ని రికవరీ చేశారు. చైన్‌స్నాచింగ్ లో దొంగిలించిన బంగారాన్ని ఎచ్చెర్ల గ్రామానికి చెందిన రామునాయుడికి ఇచ్చినట్టు రైల్వే పోలీసు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ఎచ్చెర్లకు చెందిన రాము నాయుడును, ఆ బంగారాన్ని అప్పటికే కరిగించి విక్రయించిన గుప్తాను పోలీసులు నిందితుల జాబితాలో చేర్చి చివరి నిమిషంలో తప్పించినట్లు తెలిసింది. కేసు నుంచి తప్పించడానికి రామునాయుడు నుంచి రూ.2 లక్షలు, గుప్తా నుంచి రూ.50వేలు జీఆర్‌పీ పోలీసులు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో శ్రీకాకుళం రూరల్ మండలానికి చెందిన జీఆర్‌పీ ఏఎస్ఐ కీలకభూమిక పోషించినట్టు ఎచ్చెర్లలో జోరుగా ప్రచారం సాగుతుంది. ఇందులో ఎచ్చెర్లకు చెందిన విశ్రాంత వీఆర్వో జేవీఆర్ నాయుడు (పొట్టినాయుడు) మధ్యవర్తిత్వం నడిపినట్టు చెబుతున్నారు.

### ప్రమేయం ఉన్నా.. తప్పించారు

ఈ కేసు నుంచి తప్పించుకున్న రామునాయుడు ఒకటో నిందితుడి నుంచి బంగారం తీసుకొని శ్రీకాకుళంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.2 లక్షలకు కుదువపెట్టి డబ్బులు తీసుకున్నట్టు రైల్వే పోలీసుల విచారణలో గుర్తించారు. కొన్ని రోజుల తర్వాత ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువ పెట్టిన బంగారాన్ని ఎచ్చెర్ల గ్రామానికి చెందిన గుప్త అనే వ్యాపారితో విడిపించాడు. చోరీ బంగారాన్ని విక్రయించడానికి రామునాయుడు, గుప్తా ప్రయత్నాలు చేసినా ఎవరూ వాటిని కొనుగోలు చేయలేదు. చివరికి ఆ బంగారాన్ని కరిగించి విక్రయించేశారు. ఈ ప్రక్రియ పూర్తిచేసిన కొన్ని రోజులకే రైల్లో దొంగతనం చేసిన నరసన్నపేటకు చెందిన యువకుడు రైల్వే పోలీసులకు చిక్కాడు. తనదైన స్టైల్లో విచారించగా రామునాయుడుకి బంగారం ఇచ్చినట్టు నిందితుడు అంగీకరించాడు. దీంతో రామునాయుడుని ఆమదావలస రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో రామునాయుడిని కేసు నుంచి తప్పించడానికి విశ్రాంత వీఆర్వో పొట్టినాయుడు రంగంలోకి దిగారు. పొట్టినాయుడు సమీప బంధువు చింతాడకు చెందిన జీఆర్‌పీ ఏఎస్ఐని కలిసి రామునాయుడుని ఈ కేసు నుంచి తప్పించాలని మంతనాలు జరిపినట్టు తెలిసింది. దీంతో రామునాయుడుతో రూ.2లక్షలు ఏఎస్ఐకి పొట్టినాయుడు ముట్టజెప్పినట్టు తెలిసింది. చోరీ చేసిన బంగారాన్ని కుదువ నుంచి విడిపించి కరగదీసిన గుప్త నుంచి 7 తులాల బంగారాన్ని రికవరీ చేయించి ఆయన నుంచి రూ.50 వేలు ఇప్పించినట్టు విశ్వసనీయ సమాచారం. చోరీ బంగారం కుదువ పెట్టడం, ఆ తర్వాత కరగదీయడంలో రామునాయుడు ప్రమేయం ఉన్నా కేసు నుంచి తప్పించారని ఎచ్చెర్లలో ఈ వ్యవహారం చక్కర్లు కొడుతుంది.

### ఉద్యోగాలు ఇప్పిస్తానని

రామునాయుడు రిమ్స్‌లో ఉద్యోగినంటూ గ్రామంలో చెప్పుకొని తిరుగుతుంటాడని తెలిసింది. వాస్తవంగా రామునాయుడు కారు డ్రైవర్‌గా పని చేస్తున్నట్టు భోగట్టా. గతంలో ఎచ్చెర్ల టీడీపీ నాయకుడికి ప్రధాన అనుచరుడిగా పని చేశారని తెలిసింది. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ పరిచయంతోనే రైల్వే కోచ్‌లో బంగారం చోరీ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న నరసన్నపేటకు చెందిన యువకుడు రామునాయుడికి బంగారం ఇచ్చినట్లు తెలిసింది. ఇదే మొదటిసారి కాదని తెలిసింది. రామునాయుడు ఇలాంటి వ్యవహారాలు చాలా చేసినట్లు ఆరోపణలున్నాయి. రామునాయుడిని జీఆర్‌పీ పోలీసులు తీసుకువెళుతున్నప్పుడు తప్పుడు పనులు చేస్తావా అంటూ గ్రామ పెద్దలు రెండు చెంపదెబ్బలు కొట్టినట్టు తెలిసింది. ఈ కేసు నుంచి రామునాయుడు తప్పించడానికి ఏఎస్ఐ జీఆర్‌పీలో పని చేయడం, సమీప బంధువు కూడా కావడం కారణమని ప్రచారం సాగుతుంది.




## జీటి రోడ్డు మాదిరిగా
# సెంటర్ పార్కింగ్‌కు అవకాశం ఇవ్వండి

- వ్యాపారాలు సాగక అద్దెలు చెల్లించలేని స్థితి
- డివైడర్ వెడల్పు పెంచడం సహేతుకం కాదు
- ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి
- పాలకొండ రోడ్డు వ్యాపారులు తీర్మానం
- ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించాలని నిర్ణయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో జీటీ రోడ్డు మాదిరిగా సెంటర్ పార్కింగ్‌కు అవకాశం ఇవ్వాలని పాలకొండ రోడ్డులో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న యాజమాన్యాల ప్రతినిధులు తీర్మానించారు. గురువారం స్థానిక వరం రెసిడెన్సీలో పాలకొండ రోడ్డులో వ్యాపారులంతా సమావేశమై సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ముక్తకంఠంతో జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి విన్నవించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ పాలకొండ రోడ్డును ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కోరారు. పాలకొండ రోడ్డులో గత కొన్నేళ్లుగా వ్యాపారాలు చేస్తున్నవారంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి అందులో చెట్లు పెంచడం వల్ల తీవ్ర నష్టం జరిగిందన్నారు. సాయంత్రం ఆరు తర్వాత రోడ్డుపై చీకట్లు అలమకొని వ్యాపారాలు ఎనిమిది గంటలకే మూసేసే పరిస్థితికి చేరిందన్నారు. జీటీ రోడ్డు మాదిరిగానే పాలకొండ రోడ్డులో వ్యాపారులంతా టాక్స్‌లు చెల్లిస్తున్నామన్నారు. పాలకొండ రోడ్డులో పార్కింగ్ ఇబ్బందులతో పాటు డివైడర్ మధ్యలో పెంచిన మొక్కలు చెట్టుగా మారడం వల్ల వ్యాపారాలు సాగక అద్దెలు చెల్లించలేని పరిస్థితికి కొందరు వ్యాపారులు దిగజారామని కొందరు యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. అద్దెలకు తగ్గట్టు వ్యాపారాలు సాగక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారు ఉన్నారని పేర్కొన్నారు. వ్యాపారాలు సాగకపోయినా టాక్స్‌లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పాలకొండ రోడ్డులో దీర్ఘకాలికంగా కొనసాగే వ్యాపారం ఒక్కటీ లేదన్నారు. రూ.కోట్లు పెట్టబడి పెట్టి వ్యాపారాలు సాగక మధ్యలోనే నిలిపేసే పరిస్థితి పాలకొండ రోడ్డులో ఎంతో మంది వ్యాపారాలు ఎదుర్కొన్నారని తెలిపారు. పాలకొండ రోడ్డులో ప్రస్తుతం చెట్లతో పాటు డివైడర్‌ను శాశ్వత ప్రాతిపదికన తొలగిస్తున్నందున వ్యాపారుల విన్నపాలను పరిగణలోకి తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. డివైడర్ స్థానంలో సెంటర్ పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, దీనివల్ల పార్కింగ్ సమస్యతో పాటు పాలకొండ రోడ్డులో వ్యాపారుల స్థితిగతులు మారుతాయన్నారు. ప్రస్తుతం తొలగిస్తున్న మూడున్నర అడుగుల ఉన్న డివైడర్‌ను ఐదు అడుగులుగా చేయాలని అధికారులు చేస్తున్న ఆలోచన సహేతకం కాదన్నారు. ఈ నిర్ణయాన్ని పాలకొండ రోడ్డులో ఉన్న వ్యాపారులంతా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. పాలకొండ రోడ్డులో వ్యాపారాభివృద్ధికి సెంటర్ పార్కింగ్ ఒక్కటే ప్రత్యామ్నాయమన్నారు. డివైడర్ స్థానంలో సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించాలని నిర్ణయించారు. సెంటర్ పార్కింగ్ ఏర్పాటు కోసం అందరినీ కలిసిన తర్వాత మరోమారు సమావేశం కావాలని వ్యాపారులు నిర్ణయించారు. సమావేశంలో పాలకొండ రోడ్డు వ్యాపారులు వీనస్ హరి, సుప్రీం ఎలక్ట్రానిక్స్ దివాకర్, డే అండ్ నైట్ మెడికల్స్ కరుణ్‌కుమార్ గుప్తా, క్లాసిక్ కంప్యూటర్ తారక్, జేఎంఆర్ రాజా, డాక్టర్ అంధవరపు రవికుమార్, శివానంద వినోద్, వారాహి సిల్క్స్ నాని, సూర్య సిండికేట్ రవికాంత్, చంద్రమౌళి నాగరాజు, నగేష్, బాలాజీ ఎలక్ట్రానిక్స్ యజమానితో పాటు 60 మంది వరకు వ్యాపారులు పాల్గొన్నారు.

• ఎడిటోరియల్

# మళ్లీ లాక్‌డౌన్ వస్తే మన పరిస్థితి ఏంటి?

ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించకపోతే జనవరి 10వ తేదీ తర్వాత 'కేష్‌లెస్' వైద్యసేవలు కొనసాగించలేమని తెలంగాణ హాస్పిటల్స్ అసోసియేషన్ కూడా ఆ రాష్ట్రప్రభుత్వానికి విన్నవించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే ఆరేడు సంవత్సరాలుగా ఈ విన్నపాలు సాగుతూనే వున్నాయి. అప్పుడు జగన్ ప్రభుత్వం, ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ విన్నపాలు 'చెవిటివాని ముందు శంఖం ఊదినట్టే' వున్నాయి. ముఖ్యమంత్రులు అపుడపుడు ముష్టి వేస్తున్నట్టు బకాయిల్లో కొంత కొంత విదిలిస్తున్నారు. చేసిన సేవలపై బకాయిలు తీర్చాలని తరచు సమ్మె నోటీసులు ఇవ్వడం వల్లా డాక్టర్లూ, పదే పదే అడిగించుకోవడం వల్ల ప్రభుత్వాలూ డిగ్నిటీని కోల్పోతున్నాయి. ఈ రెండు పక్షాలకూ ఒకరి మీద ఒకరికి విశ్వాసం, గౌరవ మర్యాదలు సన్నగిల్లుతున్నాయి. ఇందువల్ల అంతిమంగా నష్టపోయేది ప్రజలే! ఆస్పత్రులను డాక్టర్లను డబ్బు లాగేసే వ్యవస్థగా ప్రజలు ఒక విధమైన శత్రుభావాన్ని పెంచుకుంటున్నారు. కరోనా భూతం విరుచుకుపడిన సమయంలో పాలకులకు, నాయకులకు, సంపన్నులకు పేదలకు – డాక్టర్లు ఆకస్మికంగా దేవుళ్లు దేవతలు అయిపోయారు. ఆ మహమ్మారి మాయం కాగానే మళ్లీ పాత కథ మొదలైంది. ఇందుకు మూలం వైద్య ఖర్చులకు, ప్రజల ఆదాయాలకు పొంతన లేకపోవడమే! మైండ్ సెట్ మార్చుకున్న మధ్య తరగతి వర్గాలు తమ బడ్జెట్‌లో వైద్య ఖర్చులను ఒక భాగంగా చేసుకుని హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల అలాంటి వారికి చికిత్సల భారంలేదు. దిగువ ఆదాయవర్గాల ప్రజలను ప్రభుత్వాలే ఆరోగ్యశ్రీలో చేర్చడం వల్ల వారికి కూడా ఆర్థిక భారాలు లేవు. ఆయితే ఈ భారాలన్నీ ఆరోగ్యశ్రీ చికిత్సలు చేసిన హాస్పిటల్స్ మీదే పడుతున్నాయి. జీతాలు, కొనుగోళ్లు, అద్దెలు, అప్పులు, వడ్డీలు పెనుభారమై వైద్య చికిత్సలు చేసుకోవలసిన డాక్టర్లు ఫైనాన్షియల్ మేనేజిమెంటుతో చికాకు పడిపోతున్నారు. ప్రభుత్వాన్ని బూతులు తిట్టుకుంటున్నారు. తీరని బాకీలను ఇంకా పెంచుకునే ధైర్యంలేక 'మా దగ్గర ఆ డాక్టర్ లేరు. ఈ సదుపాయం లేదు' అని ఆరోగ్యశ్రీ పేషెంట్లను చేర్చుకోవడం లేదు. కొద్ది మంది డాక్టర్లయితే తెగించి డబ్బు కడితేనే వైద్యం అని తేల్చి చెపుతున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ పేషెంట్లు బిక్కచచ్చిపోయి ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఇదంతా ప్రభుత్వానికి, పాలకులకు తెలియనిది కాదు. డబ్బు సమస్యలు ఎప్పుడూ వున్నవే! ఎప్పటికీ వుండేవే! అయినా వ్యక్తులకు నేరుగా ప్రయోజనం ఇచ్చే ఒక్క సంక్షేమ పథకం కూడా ఆగలేదు. మరి దిగువ ఆదాయవర్గాల వారికి భరోసా ఇచ్చే ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎందుకు చిన్న చూపు చూస్తున్నారు? బడ్జెట్‌లో 2 శాతం మాత్రమే వున్న ఆరోగ్యశ్రీని ఎప్పుడూ అప్పుల్లోనే వుంచడానికి కారణం నిధులు లేకపోవడమేనంటే నమ్మమంటారా? ఆరోగ్యపరిస్థితులు బాగోలేవు. ప్రపంచవ్యాప్తంగా అక్కడక్కడా అంతుచిచ్చని వైరస్ ప్రజల్ని భయపెడుతున్నాయి. ఏ కారణంగా ఎక్కడ ఎక్కడ అకాలమరణాలు వెల్లువెత్తుతున్నాయో అధ్యయనాలు కూడా ప్రారంభమే కాలేదు. ఇపుడు మళ్లీ ఒక చైనా వైరస్ ఆసియా దేశాలను చుట్టుముట్టేస్తోంది. ఇదే గనుక విజృంభిస్తే 'మేమున్నాము మీకేమి భయంలేదు' అని భరోసా ఇవ్వడానికి ఏ డాక్టరైనా ముందుకి వస్తారా? తక్షణ చికిత్సలకు మందులు భద్రపరచగల కొనుగోలు శక్తి ఏ డాక్టర్‌కి వుంటుంది. గతంలో కరోనాకి అడ్డంపడిన స్ఫూర్తిని, బాధ్యతను ఆరోగ్యశ్రీ దెబ్బతగిలిన ఏ డాక్టరైనా ఏ ఆస్పత్రి అయినా స్వచ్ఛందంగా తీసుకోగలుగుతారా? ప్రాణాన్ని నిలబెట్టిన వ్యక్తిగతమైన సంతృప్తి, ఆత్మానందము ఏ డాక్టర్‌కైనా మిగులుతాయా? ప్రభుత్వ అలసత్వమే నిర్లక్ష్యమో, డాక్టర్లకేంటి అనే దృక్పథమో తప్ప ఆరోగ్యశ్రీ బకాయిలు కొండలా పెరిగిపోతూండటానికి మరో పెద్ద కారణం కనిపించదు. డాక్టర్లకు ఇది కేవలం డబ్బు సమస్య మాత్రమే కాదు. డబ్బుతో పాటు డాక్టర్ల గౌరవ మర్యాదలు డిగ్నిటీ? చిన్నబుచ్చుకుంటున్న సమస్య. అవసరానికి వైద్యం చేసి డబ్బుకోసం లేదు లేదు అనిపించుకుంటున్న ఆత్మగౌరవ సమస్య! ఎందరికో మేలు చేసే ఆరోగ్యశ్రీ పథకం మీద మీకు నమ్మకమూ, గౌరవమూ లేకపోతే ఎలా? అందులో మంచి మీరు తీసుకుని చెడు డాక్టర్లకు పులిమెయ్యడం ఏ విధంగా సమంజసం? ఆరోగ్యశ్రీ నియమ నిబంధనలను అతిక్రమించిన ఆస్పత్రుల మీదా డాక్టర్ల మీదా కఠినమైన చర్యలు తీసుకోవలసిందే! అదే సమయంలో కనీసం మూడు నెలలకైనా బకాయిలు పూర్తిగా చెల్లించే ఏర్పాటు కూడా చేయవలసిందే!! ముఖ్యమంత్రులూ! ఆరోగ్యశ్రీ ఆస్పత్రులను ఆర్థిక సమస్యల నుంచి బయటపడెయ్యండి! డాక్టర్ల డిగ్నిటీని నిలబెట్టండి! ప్రభుత్వము, నాయకులు, ఆస్పత్రులు, డాక్టర్లు, పేషెంట్ల మధ్య పరస్పర గౌరవ మర్యాదలు పెరిగే వాతావరణాన్ని తీసుకురండి!!

# స్వామి వివేకానంద విద్యార్థులకు స్ఫూర్తి కావాలి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ప్రపంచ మానవాళికి మార్గదర్శి అయిన స్వామి వివేకానంద విద్యార్థులకు స్ఫూర్తి కావాలని ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్ అన్నారు. శ్రీ శారదా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ యువజన వారోత్సవాల నాల్గవ రోజు కార్యక్రమాన్ని గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తొలుత కళాశాల జాతీయ సేవాపథకం నేతృత్వంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వివేకానంద సాహిత్యాన్ని విద్యార్థులు తప్పనిసరిగా చదివి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో యువజనోత్సవాల కన్వీనర్ మందపల్లి రామకృష్ణారావు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ జలుమూరు రవిబాబు, కళాశాల అధ్యాపకులు జి.ధనుంజయరావు, కె.రాజారావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాజెక్ట్ ఆధునీకీకరణకు నిధులు కేటాయించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వంశధార ప్రాజెక్టు ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహన్‌రావులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యా లయంలో వారు మాట్లాడుతూ వంశధార ప్రాజక్ట్ శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో గుండెకాయ వంటిదన్నారు. వంశధార ప్రాజెక్టు నిర్మించి 50 సంవత్సరాలు కావస్తుందని, ప్రాజెక్టు శిధిలావస్థకు చేరుకుందన్నారు. శిథిలం అయితే జిల్లాలో వ్యవసాయ రంగం మొత్తం కుప్పకూలిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వంశధార నది ఎడమ కాలువ ద్వారా లక్ష ఏబై వేల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలు, హై లెవెల్ కెనాల్ ద్వారా 5 వేల ఎకరాలు, ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 20వేల ఎకరాలుకు నీరు అందిస్తున్నందన్నారు. వంశధార ప్రాజెక్టు నిర్వహణకు నిధులు లేక శిధిలావస్థలో ఉన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వంశధార ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదని వారు ప్రశ్నించారు. వంశధార ఆధునీకరణ కోసం కుడికాలువ 104కిలోమీటర్లు ఎడమ కాలువ 73 కిలోమీటర్లు పొడవునా లైనింగ్ చేయడం కోసం రూ.800 కోట్లు, 250 స్ట్రక్చర్స్ పునర్నిర్మాణం కోసం రూ.300 కోట్లు, షెట్టర్స్ కోసం రూ.100 కోట్లు, పిల్ల కాలువలు మరమ్మత్తు కోసం రూ.300కోట్లు, నిధులు అవసరం అవుతాయని నిపుణులు చెబుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పాలకుల నిర్లక్ష్యమే శ్రీకాకుళం జిల్లా వెనుకబాటుకు కారణం అని వారు విమర్శించారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణ చేసి రెండు పంటలకు నీరు ఇస్తే వ్యవసాయ రంగం నుండి 1000కోట్లకు పైగా ఆదాయం వస్తుందని, తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు వస్తాయని, వలసలు నివారించి జిల్లా అభివృద్ధి చెందుతుందని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎస్ఐఎంపీ (సపోర్ట్ ఫర్ ఇంప్రూవ్ మెంట్ అండ్ మోడరైజేషన్ ఆఫ్ ప్రాజక్ట్) వంశధార బ్యారేజి ఆధునికీకరణ కోసం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎందుకు నిధులు తేవడం లేదు అని వారు ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార బ్యారేజీను ఆధునికరణ చేయాలని వారి డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కాదని, నదీజలాలను వినియోగించుకోవడం ద్వారా మాత్రమే అభివృద్ధి అవుతుందని వారు అన్నారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణ కోసం దశల వారి పోరాటాలు చేస్తామని వారన్నారు.

## ఆడవరం పాఠశాలకు వేమన ఫౌండేషన్ గుర్తింపు

(సత్యంన్యూస్, గార)

మండలంలోని ఆడవరం పాఠశాలకు ఎస్ ఎస్ బి ఎన్ కళాశాల క్యాంపస్ వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమన పద్య పటన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సాహితీ చైతన్య కిరణాలు, బాల కథానియం అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులైన యోదా, మోహిత్, కేశిని, జీవన్, శంకర్, గగన, గాయత్రి, జెస్సిక, మనస్వి, చార్మిల్, మేఘన, ఆకాంక్ష, భరత్, సాయి శరత్ తదితర విద్యార్థులు అనగనగా రాగమతిశయిల్లుచు, చదువు చదువకున్న సౌఖ్యంబు ఉండదు, బహుళ కావ్యములను పరికింపగా, ఐక్యమత్యమొక్క, ధనముకూడబెట్టి, పూజ కన్ననెంచ అను పద్యాలను చూడకుంట చదివి వాటి వివరాలను, వేమన ట్రస్ట్‌కు పంపించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్ చాన్సలర్, వేమన ట్రస్ట్ అధ్యక్షులు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి, వేమన ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, విశ్రాంత డిజిపి చెన్నూరు ఆంజనేయ రెడ్డి, వేమన ఫౌండేషన్ కార్యదర్శి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాధరెడ్డి వేమన ఫౌండేషన్ ప్రశంసపత్రాలు, మెడల్స్, వేమన పద్య పుస్తకాలు పంపించారు. ప్రశంస పత్రాలను గురువారం పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సహాయ ఉపాధ్యాయులు సోనిమి పాపారావు తదితరులు పాల్గొన్నారు.



## 11 నుంచి కబడ్డీ పోటీలు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాలలో భాగంగా మండలంలోని ధర్మవరం గ్రామంలో మేము సైతం- స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీలలో అండర్-19, మండల స్థాయి " కబడ్డీ" పోటీలు నిర్వహించనున్నట్లు సేవా సంస్థ ప్రతినిధులు యస్.మధు, జి.పవన్, బాన్న నాగేశ్వరరావు, టేకి ఆచారిలు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే ఆసక్తిగల జట్టులు తమ యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 9182254531, 8143299133 నెంబర్లలో సంప్రదించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.


# ఇండియన్ హిస్టరీలో మొదటి 100 కోట్లు రాబట్టిన సినిమాలివే!

తుపాకి.కామ్ సౌజన్యంతో...

గత కొంత కాలంగా ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై నెవ్వర్ బిఫోర్ అనేలా బిగ్ బడ్జెట్ సినిమాలు వస్తున్నాయి. టాక్ బాగుంటే కలెక్షన్లు కూడా వేల కోట్లు దాటుతున్నాయి. అయితే ఒకప్పుడు 100 కోట్ల గ్రాస్ అంటే చాలా గొప్ప. కానీ ఈ మార్కును అందుకున్న కొన్ని సినిమాలు ప్రతిభను మాత్రమే కాకుండా, భారతీయ సినిమా పరిణామాన్ని కూడా పెంచాయి. ఇక బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్, కన్నడ పరిశ్రమలో 100 కోట్ల క్లబ్‌లో చేరిన మొదటి చిత్రాలపై ఓ లుక్కేస్తే.. ఈ చిత్రాలన్నీ ఒక్కో పరిశ్రమకు ట్రెండ్ సెట్టర్ గా నిలిచాయి. బాలీవుడ్ నుంచి డిస్కో డాన్సర్, కోలీవుడ్ నుంచి శివాజీ, టాలీవుడ్ నుంచి మగధీర, సాండల్‌వుడ్ నుంచి కేజీఎఫ్ సినిమాలు ఒక్కో పరిశ్రమకు గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ఈ విజయాలు భారతీయ సినిమాను కొత్త దిశలో నడిపించాయి. ఈ 100 కోట్ల క్లబ్ విజయాలు భారతీయ సినిమా స్టాండర్డ్స్ పెంచాయని చెప్పవచ్చు. కంటెంట్ పర్ఫెక్ట్‌గా ఉంటే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తాయని ఈ సినిమాలు రుజువు చేశాయి. సాంకేతికత, కథా కథనాలు, నిర్మాణ విలువల్లో కూడా భారతీయ సినిమాలు మరింత ముందుకు వెళ్లాయి.




టాలీవుడ్ - మగధీర (2009) తెలుగు చిత్ర పరిశ్రమలో 100 కోట్ల క్లబ్‌కి చేరిన తొలి చిత్రం మగధీర. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్, కాజల్ అగర్వాల్ జంటగా నటించిన ఈ సినిమా విజువల్ వండర్‌గా నిలిచింది. వార్ లవ్ డ్రామా నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం టాలీవుడ్‌కి గ్లోబల్‌గా గుర్తింపును తెచ్చింది. రామ్‌చరణ్ కెరీర్‌కి కూడా మగధీర బూస్టర్‌గా నిలిచింది. ఇక రాజమౌళికి కూడా మంచి ధైర్యాన్ని ఇచ్చింది. మగధీర అనంతరం టాలీవుడ్ స్థాయి కూడా అమాంతం పెరిగిపోయింది.





బాలీవుడ్ - డిస్కో డాన్సర్ (1982) బాలీవుడ్‌లో మొదటిసారి 100 కోట్ల క్లబ్‌కి చేరిన సినిమా డిస్కో డాన్సర్. మిథున్ చక్రవర్తి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని బి.సుభాష్ తెరకెక్కించారు. ఈ చిత్రం మ్యూజికల్ డ్రామాగా రూపొందింది. అప్పట్లో ఈ సినిమా సాంగ్స్ రష్యాలో సైతం ట్రెండ్ అయ్యాయి. డిస్కో డాన్సర్ భారతీయ సినిమాను అంతర్జాతీయంగా పరిచయం చేసిన చిత్రంగా నిలిచింది. ఈ సినిమా విజయంతో మిథున్ డ్యాన్స్ ఐకాన్‌గా మారారు. ఇప్పటికి అందులోని పాటలు ట్రెండ్ అవుతూనే ఉంటాయి. ఈ సినిమాతో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 100 కోట్ల ట్రాక్ మొదలైంది.




సాండల్‌వుడ్ - కేజీఎఫ్ (2018) కన్నడ పరిశ్రమలో తొలిసారిగా 100 కోట్ల మార్క్ అందుకున్న చిత్రం కేజీఎఫ్ చాప్టర్ 1. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం, కేవలం కన్నడలోనే కాదు, పాన్ ఇండియా స్థాయిలో కూడా రికార్డులను సృష్టించింది. 250 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం, కన్నడ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చింది. యశ్ పాత్రతో పాటు, రవి బస్రూర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




కోలీవుడ్ - శివాజీ (2007) తమిళ చిత్ర పరిశ్రమలో 100 కోట్ల క్లబ్‌కి చేరిన తొలి చిత్రం శివాజీ. రజనీకాంత్ హీరోగా, శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా టెక్నికల్‌గా, కథనంలో కొత్త పంథాను తీసుకొచ్చింది. 50 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా, ప్రపంచ వ్యాప్తంగా రూ.200 కోట్ల వసూళ్లను సాధించి కోలీవు డ్‌కి కొత్త రికార్డు తీసుకొచ్చింది. రజనీకాంత్ మాస్ క్రేజ్‌కి ఈ సినిమా మరో మైలురాయిగా నిలిచింది. శంక ర్ స్టామినా ఏమిటో మరోసారి ఈ సినిమాతో ప్రపంచానికి తెలిసింది.



లోకం మొత్తానికి శకునం చెప్పే బల్లి కుడితిలో పడి చచ్చిందని ఓ సామెత! తెలుగు సమాజానికి ప్రాచీన హైందవ విశిష్టత గురించి, ఆర్ష ధర్మాల గురించి, సామాజిక నైతిక విలువల గురించి, వ్యక్తుల నడత గురించి, సమాజాన్ని వ్యక్తి జీవితాన్ని ప్రభావితం చేసే సాంస్కృతిక ప్రభావాల గురించి పురాణాల కంటే ఎక్కువగా ప్రవచనాలు చెప్పే గరికపాటి నరసింహారావు అనే ప్రవచనకర్త మీద అతని మాజీ జీవన సహచరి కామేశ్వరి తీవ్రమైన నైతిక ఆరోపణలు చేస్తున్నారు. గరికపాటి గురించి కొత్తగా చెప్పాల్సిందేమీ లేదు. ఆయన అవధాని మాత్రమే కాక తన ప్రవచనాల ద్వారా ఓ సామాజిక ప్రభావశీలి (సోషల్ ఇన్‌ఫ్లూయన్సర్). చాలా సాధికారికంగానూ, తీర్పరితనంతోనూ ప్రవచనాలు చెబుతుంటాడీయన. ఈయన తన ప్రవచనాలను కావాలనుకుంటే ఆధునికంగానూ లేదా సనాతనంగానూ ఎలాంటి ధోరణిలోనైనా చెప్పగలరు. ఎక్కువగా స్త్రీ వ్యతిరేకిగా ముద్ర వేసుకున్న ఈయన కావాలనుకుంటే స్త్రీల కోసం కన్నీళ్లు పెట్టుకోగలడు కూడా. ఆ రకంగా రకరకాల ప్రవచన విన్యాసాలతో విపరీతమైన ఫాలోయింగ్‌ని సొంతం చేసుకున్నాడీయన. మొత్తానికి భారతీయ సంప్రదాయం, కుటుంబ వ్యవస్థ పటిష్టత ఆవశ్యకత గురించి, ఆ వ్యవస్థ పటిష్టత కోసం వ్యక్తులు పాటించవలసిన కౌటుంబిక, సామాజిక విలువల గురించి తన ప్రవచనాల్లో ఏకరువు పెడుతుంటాడు. అలాంటి గరికపాటి ఓ ముప్పై ఏళ్ల క్రితం తన అన్న భార్యనే తన స్వంతం చేసుకున్నాడని, ఓ దశాబ్ద కాలం కాపురం చేశాడని, ఇద్దరు పిల్లల్ని కన్నాడని ఇప్పుడు ఆ వదినగారే స్వయంగా తెలియచేయడంతో పాటు ఆయన మీద తీవ్ర ఆరోపణలు చేయడంతో తెలుగులోకం మొత్తం ఉలిక్కిపడింది.

# గరికపాటి ప్రవచనాల్లో.. నిజం ఏపాటి!

గరికపాటిగారి మాజీ వదినగారు, అనంతర కాలంలో ఆయన సహచరి ఐన కామేశ్వరి చెప్పినదాని ప్రకారం గరికపాటి అన్నగారైన వెంకటేశ్వరరావు అనే ఆసామి భార్య ఐనటువంటి కామేశ్వరిని ఆమెలోని తెలుగు భాషా పాండిత్యాన్ని గుర్తించి, ఆమెతో అవధానాలు చేయిస్తానని, ఆమె ప్రతిభని లోకం గుర్తించేలా చేస్తానని చెప్పి, ఇంకా అనేక విధాలుగా ఆమెని ఆకర్షించి, ప్రలోభ పెట్టి, ఆమె భర్తతో విడాకుల పత్రం మీద సంతకం చేయించి ఆమెతో కాపురం పెట్టారు. ఇద్దరు పిల్లలకి జన్మనిచ్చిన వారు భార్యాభర్తలుగానే బతికారు. ఐతే ఈ క్రమంలో ఆయన తనతో చాలా దురుసుగా వ్యవహరించేవాడని, తాను పాడినా ఒప్పుకునేవాడు కాదనీ, తమ మొదటి కొడుకు గురజాడకి పాటలు నేర్పిస్తుంటే గోలగోల చేసేవాడని, ఏ ప్రేమ కోసం, గుర్తింపు కోసం తాను తన భర్తని వదిలేసి వచ్చిందో అవి తనకు దక్కలేదని, పైగా అన్నీ అవమానాలేనని, అసలు ప్రేమగా వ్యవహరించేవాడు కాదనీ, అనుమానించేవాడని, పాలు పోసే అతను 'అదోలా' చూస్తున్నాడంటే అందుకు ఆమే బాధ్యురాలనీ, తాను గురువుగారైన బేతవోలు రామబ్రహ్మం మీద పద్యం రాస్తే తన మీద ఎందుకు రాయలేదని గొడవ చేశాడని, ఆయనలో 'సమర్థత ' కూడా లేదని (గరికపాటి రెండో భార్యకి పిల్లలు లేరనే విషయాన్ని గమనించాలని ఆమె సూచించారు), తన ఆస్తులన్నీ తీసేసుకున్నాడని, వాళ్లమ్మ ఈమెని వదిలించుకోమని అంటున్నదని, ఆమె చచ్చిపోతే గంధపు చెక్కలతో శవదహనం చేయిస్తానని అన్నాడని, చివరికి ఆ ప్రేమ రాహిత్యపు వాతావరణంలో ఇమడలేక బైటకి వచ్చేసానని, తనకి నచ్చినవాడితో వెళ్లిపోయానని, గరికపాటి నుండి ప్రేమ దొరికి వుంటే తాను వెళ్లిపోయేదానిని కాదని, ఆయన అవమానాలు, ఛీత్కారాలు తట్టుకోలేకనే వెళ్లిపోయానని తాను చేసిన వీడియోలో చెప్పుకొచ్చారామె.

ఐతే ఇప్పుడే ఆమె ఆ వీడియో ఎందుకు చేశారనేది ప్రశ్న. సమాజంలోని బాధిత స్త్రీలందరూ బైటకి వచ్చి చెప్పుకోవాలని గరికపాటే అన్నారని, అందుచేత తాను బైటకి వచ్చానని ఆమె అన్నారు. ఏపిలో చాగంటికి సాంస్కృతిక సలహాదారు పోస్టు ఇచ్చినట్లు తెలంగాణలో కూడా గరికపాటికి కూడా అలాంటి పోస్టే ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు, అది నచ్చని తెలంగాణవాదులు కామేశ్వరిగారితో ఈ వీడియో చేయిస్తున్నట్లు కూడా వార్తలు/ఊహాగానాలు వస్తున్నాయి. 2024 మార్చ్ నెలలో మొదట వీడియో చేయగానే పెద్ద కుమారుడైన గురజాడతో ఆమె మీద క్రిమినల్ కేసు పెట్టించారు. అది ఆమెకి మరింత ఆగ్రహం కలిగించి మరిన్ని వీడియోలు చేసేలా చేసింది. తమ మధ్య ఏం జరిగిందనేది వీడియోల్లో తాను అన్నీ చెప్పుకోలేనని అన్నారామె. తన పక్కన కూర్చోనిస్తే రేపు తన భుజం మీదనే చెయ్యేస్తుందనేది ఆయన భయమని ఆవిడ అన్నారు. ఈ మాత్రం చొరవని ఒప్పుకోలేని కురచ మనస్కులతో ఆత్మ గౌరవం వున్న ఎవరైనా తెగతెంపులే చేసుకుంటారు. నాకైతే ఈ ఉదంతం మొత్తం తన సహచరుడి నుండి ప్రేమని, ఆప్యాయతని పొందలేకపోగా అవమానాల్ని ఛీత్కారాల్ని ఎదుర్కొని, వాటి నుండి బైట పడటానికి ఓ మహిళ చేసిన డెస్పరేట్ ప్రయత్నం! ఈ పురుషాధిక్యపు సమాజంలో ఆమెని దోషిగా నిలబెట్టడం, గరికపాటికి పూర్తి సానుభూతి దొరకటం అసహజమేమీ కాదు. అందుకు విరుద్ధంగా జరిగితేనే మనం ఆశ్చర్యపోవాలి. ఇన్నేళ్లు మౌనంగా వుండి ఇప్పుడే ఎందుకు బైటపడాలనే ప్రశ్నకి అర్థం లేదు. ఎప్పుడు, ఎలా బైటపడాలనేది బాధితులు తమ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు. బైటపడటానికి పరిస్థితులు అనుకూలంగా వుండకపోవచ్చు. ఒక వ్యక్తితో పీడింపపడ్డ బాధితుల జీవితంలో కొత్త వ్యక్తులు వస్తే జీవితానికి సంబంధించిన నిర్ణయాలలో ఈ కొత్తవారి ప్రమేయం కూడా వుంటుంది. ఆ కొత్త వ్యక్తుల సానుకూలత, సహకారం లేకుంటే చేయగలిగిందేముంది? కామేశ్వరిగారి వెర్షన్ ప్రకారం ఆమె ఇప్పుడు పూర్తిగా ఒంటరి, స్వతంత్రురాలు, ఏ బంధంలోనూ లేదు. ఈ స్వతంత్ర భావన ఆమెకి తన గత కాలపు చేదు జ్ఞాపకాలని, గరికపాటి ద్వంద్వ ప్రవృత్తిని బైటపెట్టే వెసులుబాటు కలిగివుండొచ్చు. కాలం గడిచినంత మాత్రాన మనసు గాయాలు సమసిపోవు. అవి ఎప్పుడైనా బైటపడొచ్చు. కొందరు ఆవిడ బ్లాక్మెయిల్ చేస్తున్నారంటున్నారు. బ్లాక్మెయిలింగ్ ఓ రహస్య వ్యవహారం. అది ఏదైనా బట్టబయలు కాకమునుపు జరిగేది. సమాజం ముందు మొత్తం బహిరంగపరిచాక ఇంక బ్లాక్మెయిలింగ్ ఏముంది?

తన కంటే రెండేళ్లు చిన్నవాడైన తన మరిదికి బుద్ధి లేకపోతే తనకైనా వుండొద్దా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ సమస్య ఆమె భర్త నుండి బైటకి వచ్చి గరికపాటితో సహజీవనం చేయడమా లేక గరికపాటి వల్ల కలిగిన అశాంతి, ఆశాభంగమా? అసలు ఆవిడ ప్రధాన ఆరోపణ ఏమిటి? తనకి గరికపాటి నుండి ప్రేమ దక్కకపోగా అవమానం, అశాంతే మిగిలాయని కదా ఆవిడ ఆరోపణ. తన వాదనకు ఊతంగా ఆవిడ కొన్ని ఉదంతాలు కూడా చెప్పారు. ఆమె మొదటి వివాహబంధం తెగతెంపులు కావటం మీదనే ఫోకస్ చేసే మోరల్ జడ్జెస్ ఆ తెగతెంపుల ఉదంతంలో గరికపాటి పాత్రని ఎందుకు విస్మరిస్తున్నారు? మనం ఇక్కడ చూడవలసింది ఎవరు తప్పు, ఎవరు ఒప్పు అని కాదు. వ్యక్తుల దృక్పథాల్ని బట్టి నైతకత అనైతికతలు, తప్పొప్పులు మారుతుంటాయి. తాము చేసేది తప్పు అని ఆ రోజు గరికపాటి, కామేశ్వరి అనుకొని వుంటే ఇద్దరూ కలిసి జీవించేవారే కాదు. అందుకే వారి మధ్యన బంధమేర్పడటం సమస్య కాదు. ఆ బంధం ఎలా కొనసాగిందనేది అసలు విషయం. ఒక పురుషాధిక్య వ్యవస్థలోని కరుడు కట్టిన బ్రాహ్మణ కుటుంబంలో గరికపాటి వంటి వారి ప్రవర్తన ఆశ్చర్యం కలిగించేదేమీ కాదు. కామేశ్వరి తన ఆవేదనని, తాను ఏమి కోల్పోయానో చెప్పిన విధానంలో విశ్వసనీయత వుంది. గరికపాటి రెండో భార్య తన పిల్లలనిద్దరినీ తన కన్న బిడ్డల వలె బాగా చూసుకున్నదని, ఆమె ఒక దేవత అని కూడా కామేశ్వరి అనడం మనం గమనించాలి.

తాను నమ్మి తన జీవితంలో ఆచరించలేని సనాతన సంప్రదాయాల్ని, కుటుంబ విలువల్ని జనం తేరగా దొరికారని ప్రవచనాలుగా చెప్పే హక్కు గరికపాటికి వుందా అని మనం ఆలోచించాలి. అతనికి ఖచ్చితంగా ఆ హక్కు లేదు. అతను ఇంకా ఓ ప్రవచనకారుడిగా కొనసాగితే అది జనం తప్పే. కాలానుగుణంగా వ్యవస్థలు మారుతుంటాయి. ఆ మార్పుకి అనుగుణంగా విలువలూ మారుతుంటాయి. వాటిని వివరించేవాడు ఆలోచనాశీలి. పాత వాటినే పట్టుకొని వేలాడండి అని చెబుతూ తాను మాత్రం మరో రకంగా బతికేవాడు ప్రవచనకారుడు. అవధానం తరహా విద్వత్తు ఓ సాహిత్య వినోద కార్యక్రమం. ఒక స్టాండప్ కమెడియన్‌కి అతనికీ ఏమీ తేడా లేదు. ఆ విషయం మనం దృష్టిలో పెట్టుకోవాలి. అంతకు మించిన ప్రాధాన్యత తీరిక వర్గానికి చెందిన ఓ అవధానికి లేదని మనం గుర్తించాలి. పురాణాల్ని వల్లెవేసి, నాలుగు పద్యాలు కట్టి, పాలకుల్ని ఓ వంద పొగడ్తలతో ఆకర్షించి శాలువాలకి, సత్కారాలకి, పురస్కారాలకి, పదవులకి అమ్ముడుపోయే వాళ్లే వీరంతా! వీరి ప్రతిభ పాలివ్వని ఓ అజాగళ స్తనం (మేకపోతు మెడ కింద వేలాడుతుంటాయి).

ఇంత జరిగినా కామేశ్వరి ఇంక తనలోని వైరుధ్యాల్ని పట్టించుకోవడం లేదు. "మేం బ్రాహ్మణులం. మా దగ్గర విద్వత్తు వుంటుందే కానీ ధైర్యం వుండదు" అని చెప్పడంలో దురహంకారమే వుంది. తన జీవితంలో మానవ సహజాతాలను అనుసరించి పోయిన ఆవిడ తన కులాన్ని భుజాన వేసుకునే మాట్లాడుతున్నది. ఏ వ్యవస్థీకృతమైన పురుషాధిక్యపు విలువల వల్ల తాను బాధపడిందో వాటికి వ్యతిరేకంగా ఆవిడ మాట్లాడటం లేదు. ఆవిడ కోపం మొత్తం ఒక్క వ్యక్తి మీదనే. అతడు తనకి అన్యాయం చేశాడనేదే ఆవిడ ఆరోపణ. పైగా మహిళా దినోత్సవం సందర్భంగా ఆవిడ ఈ తరం యువతులకు ఇస్తున్న సందేశమేమంటే "మీరు తల్లిదండ్రులు చూసిన సంబంధాలను మాత్రమే చేసుకోండి. ప్రేమ వివాహాలొద్దు. ఎందుకంటే సంప్రదాయ వివాహాలలో ఇబ్బందులెదురవుతే మీకు మీ కుటుంబం అండంగా వుంటుంది. ప్రేమ వివాహాలలో మీకు ఆ మద్దతు దొరకదు." ఆవిడ తాను పెద్దలు చేసిన సంప్రదాయ వివాహం నుండే బైటపడే గరికపాటితో కొత్త ప్రయాణం మొదలుపెట్టిందనే విషయాన్ని ఆవిడ మరిచిపోయింది. ఎంత వైరుధ్యం? ఏ పెద్దలు ఆవిడకి అండగా నిలిచారు?

**- అరణ్యకృష్ణ**

## క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్రైస్తవుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, బింకం బర్నబాస్, పాస్టర్ కేవీ సాల్మన్‌లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్‌ను కోరారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శ్రీకాకుళం జిల్లా క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలుసుకొని క్రైస్తవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు వివరించారు. క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వినతిపత్రం అందజేశామని చెప్పారు. క్రైస్తవులకు ప్రతీ మండలంలో స్మశానవాటిక నిర్మించాలని, ఎస్సీలు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే బీసీ'సి' ధ్రువపత్రాన్ని మంజూరు చేయాలని తహశీల్దార్లకు అధికారాలు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. అదే విధంగా ఇటీవల రిమ్స్ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించిన వారిపై దురుసుగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. హైటీ క్రిస్మస్ నిర్వాహకులు, జిల్లా మైనారిటీ అధికారి పై చర్యలు తీసుకోవాలని కోరారు కలెక్టర్ స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని చెప్పారని వివరించారు. అనంతరం 2025 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రిష్టియన్ జాయింట్ కన్వీనర్స్ ఓంపూరు రమేష్, రాడ విజయ కుమార్, జి.శామ్యూల్ ఆరుణు కిరణ్, పాస్టర్ జార్జి ముల్లర్. టి పీటర్, ఎ.ఇమాన్యుయేల్, పాస్టర్ యన్.శ్రీనివాసనాయక్, పాస్టర్ ప్రవీణ్ జోయ్ పాస్టర్ సిహెచ్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు

## రాజినాయుడుకు అభినందన

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

నియోజకవర్గం లావేరు మండల వైకాపా అధ్యక్షులుగా నియమితులైన దన్నాన రాజినాయుడును మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అభినందించారు. ఈమేరకు గురువారం కలిసిన రాజినాయుడును ఆయన దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ లావేరు మండల ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అభిప్రాయం మేరకు రాజినాయుడును మండల అధ్యక్షునిగా నియమించామన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా కార్యకర్తలుకు, పార్టీకి అన్యోన్యబంధం ఏర్పరచాలన్నారు. కార్యకర్తలందరూ కలిసి పార్టీని గెలుపు బాటలో తీసుకెళ్లడానికి కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం మండల అధ్యక్షునిగా ఎన్నికైన దన్నాన రాజినాయుడు కూడా మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో లావేరు మండల ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పిటీసీ మీసాల సీతంనాయుడు, మండల జేసిఎస్ కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు షేక్ ఛాన్ భాషా, ఎంపిటీసీల సంఘం అధ్యక్షులు ప్రతినిధి జగ్గురోతు తవిటి నాయుడు,సర్పంచ్ ప్రతినిధి దుర్గాసి ధర్మారావు, ఎంపిటీసీ ప్రతినిధి గంట్యాడ సత్యం,యువనాయకులు దన్నాన హరి,ఇజ్జాడ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



## కవిత్వ పుస్తకావిష్కరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలలో కామ్రేడ్ కొత్తకోట రామలక్ష్మి రచించిన "నేనొక" కవిత్వ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకకార్యదర్శి కొత్తకోట అప్పారావు తెలిపారు. ఈనెల 5 నుండి 8 వరకు కాకినాడలో జరిగిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎన్.ఎస్ ప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడుతూ రామలక్ష్మి రచించిన పుస్తకం సమాజంలో ఉన్న సమస్యలు, వాటికి పరిష్కారమార్గాలు ప్రతిబింబిస్తున్నాయని కొనియాడారు. చక్కటి కవితలు రాశారని వారు అన్నారు. ఆమె ఉద్యమ స్ఫూర్తితో రాసిన కవితలు ఎంతో మందికి ప్రేరణ కలిగిస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమములో యుటీయఫ్ రాష్ట్ర నాయకత్వం మొత్తం పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పురుషులు, మహిళలు పాండిచ్చేరిలో ఈనెల 11నుంచి 14వరకు జరగబోయే టోర్నమెంట్‌కి ఆంధ్రప్రదేశ్ పురుషులు జట్టులో కేశవరావు పేటకి చెందిన పొందూరు హరికృష్ణ, మహిళలు జట్టులో గురుగుబెల్లి దుర్గాప్రశాంతి, పొందూరు లావణ్య ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసింహారాజు, సెక్రటరీ సిగిలిపెల్లి లక్ష్మీదేవిలు తెలిపారు. ఈ క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరమరాజు, వైస్ ప్రెసిడెంట్ మెట్ట తిరుపతిరావు, సర్పంచ్ పైడి భాస్కరరావు, ఎంపీటీసీ సూర జగదీష్, మాజీ సర్పంచ్ పొందూరు భీమరావు ఎస్ఎంపీ చైర్మన్ అన్నెపు లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు బీవీ సాయిరాం, పీడీ ఎంవీ రమణ, పీఈటీ జి.మల్లేష్ జనసేన మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీను ఉపాధ్యాయలు క్రీడాకారులుకి అభినందనలు తెలిపారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి,
రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# సిక్కోలు డ్వాక్రా బజార్
# మరో రెండు రోజులే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న సిక్కోలు డ్వాక్రా బజార్ కేవలం ఒక వ్యాపార వేదిక మాత్రమే కాకుండా, మహిళా సాధికారతకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూర్చుతోంది. జిల్లా కేంద్రంలోని ఏడురోడ్ల కూడలి వద్ద మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఈ బజారులో గత మూడు రోజులుగా జోరుగా అమ్మకాలు జరుగుతుండగా, సంక్రాంతి పండుగ దృష్ట్యా ఇంకా రెండు రోజులు మాత్రమే ప్రదర్శన, కొనుగోళ్లకు అవకాశం కల్పించారు. దీంతో ఈ అవకాశాన్ని అంతా వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. 101 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు 78 స్టాళ్లలో వివిధ రకాల చేతిఉత్పత్తులను ప్రదర్శించి, అమ్ముతున్నారు. రూ.1.50 కోట్ల లాభార్జన ధ్యేయంగా ప్రతిరోజు రూ.30 లక్షల మేర వ్యాపారం జరిగేలా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడమే లక్ష్యంగా బజార్ నిర్వహిస్తున్నారు. బజార్ ద్వారా స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా సేంద్రీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేస్తున్నారు.

**ప్రత్యేక ఆకర్షణలు**

వివిధ రకాల ఉత్పత్తులైన మంగళగిరి నేత చీరలు, కడప హాండ్‌లూమ్స్, లావేరు జూట్ బ్యాగ్స్, బుడితి ఇత్తడి, మందస కోవ, కొయ్య బొమ్మలు, ఆత్రేయపురం పూతరేకులు, మాడుగుల హల్వా, ఆమదాలవలస సేంద్రీయ బెల్లం, గుంటూరు కారం, పచ్చళ్లు, రణస్థలం చిరుధాన్యాలు బిస్కెట్లు, పాతపట్నం ఇండోర్ ప్లాంట్స్, వంటి వివిధ రకాల ఉత్పత్తులు ఈ బజార్‌లో అందుబాటులో ఉన్నాయి. అలమండ మామిడి తాండ్ర, సీతంపేట హెర్బల్, పొందూరు ఖాదీ, అనకాపల్లి ఏటికొప్పాక బొమ్మలు, వజ్రపుకొత్తూరు ఎండుచేపలు, నెత్తల్లు, ఎచ్చెర్ల అప్పడాలు, గార మట్టికుండలు, సరుబుజ్జిలి అగరబత్తులు ఇక్కడ ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**సాంస్కృతిక కార్యక్రమాలు:**

బజార్‌కు వచ్చే వారికి అక్కడి ప్రధాన వేదికపై నిర్వహిస్తున్న కూచిపూడి, మిమిక్రి, మాట్లాడే బొమ్మ, మ్యాజిక్ షో, కోలాటం వంటి కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. 24 గంటల భద్రత కల్పించడం, ప్రత్యేకంగా వైద్య ఆరోగ్యశాఖ ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేయడం, నగదు అత్యవసరమయ్యే వారి కోసం మొబైల్ ఏటీఎం ఏర్పాటు, సిబ్బంది భోజనాల కోసం ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. స్థానికంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వాలని ఆయా సంఘాల మహిళలు కోరుతున్నారు.

**పండుగ వాతావరణంలో కొనుగోళ్లు**

డ్వాక్రాబజార్‌ను పండగ వాతావరణంలో నిర్వహించడానికి అహర్నిశలు కృషిచేయడం వల్ల కొనుగోలుదారులు, విక్రేతలు ఇద్దరూ ఆనందంగా వ్యాపారం చేసుకునే వాతావరణం ఏర్పడింది. 24 గంటలు భద్రత కల్పించడం వల్ల అందరూ నిశ్చితంగా వ్యాపారం చేయగలుగుతున్నారు. ఈ బజారు నిర్వహణను విజయవంతం చేయడం కోసం మొత్తం 8 కమిటీలను ఏర్పాటుచేశాం.

- **సుధామాధురి,** డ్వాక్రా బజార్ పర్యవేక్షకురాలు, **డీఆర్‌డీఏ**

**తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాం**

రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వివిధ రకాల ఉత్పత్తులు ఈ బజార్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇందులో చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆహార పదార్థాలు, సేంద్రీయ ఉత్పత్తులు మార్కెట్ ధర కంటే ఇక్కడ తక్కువకు లభిస్తున్నాయి. ఇక్కడే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా బజార్‌కు మరింత ఆకర్షణ చేకూరుంది.

- **లక్ష్మీ ప్రసన్న,** పీఎన్ కాలనీ

**భద్రతకు పెద్దపీట వేసాం**

డ్వాక్రా బజార్‌ను గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరు నెలల క్రితమే 15 మందితో ఒక కమిటీ వేశారు. ఇక్కడ మొబైల్ టాయిలెట్లు, మొబైల్ ఏటీఎం, అత్యవసర వైద్య సదుపాయాలు, అగ్నిమాపక భద్రత వంటి అన్ని రకాల సౌకర్యాలు డ్వాక్రాబజార్లో ఏర్పాటు చేశాం. వారి ఉత్పత్తులకు రక్షణ కల్పించి వారికి భోజన సదుపాయాన్ని అందించాం.

- **కిరణ్ కుమార్,** డీఆర్‌డీఏ పీడీ

**ఆదాయం బాగుంది**

ఈ బజార్ ద్వారా స్వయంసహాయక సంఘాల మహిళలు అధిక ఆదాయాన్ని పొందే అవకాశం జరిగింది. మహిళలు ఆర్థికంగా స్వతంత్రులు కావడానికి మార్గం ఈ బజారు. ఇంకా రెండు రోజులు సమయం మిగిలి ఉంది. గనుక ఎక్కువ మంది ఇక్కడికి వచ్చి ఉత్పత్తులను కొనుగోలుచేసి మాలాంటి వాళ్లని ప్రోత్సహించాలి. బయట మార్కెట్‌లో దొరికే వస్తువులే మాదగ్గర తక్కువకు లభిస్తున్నాయి.

- **కరుణ,** ఎస్‌హెచ్‌జి మహిళ







# షార్ట్‌కట్‌లో వైకుంఠయాత్ర

**హిందూ మత విస్తృత ప్రచారం చేస్తున్న ఏ వెధవా కూడా క్యూ లైన్లో తొక్కుకుచావడం ద్వారా కూడా వైకుంఠం చేరవచ్చనీ చెప్పలేదు. ఎవడి ఊళ్లోని గుడికి వాడు ఉత్తర ద్వారం గుండా వెళితే వైకుంఠం సంగతేమో కానీ ఎవడింటికి వాడు అయితే మాత్రం క్షేమంగా తిరిగి చేరొచ్చు. నిజంగా తొక్కిసలాటకు గురైన భక్తులను కాదు నిందించాల్సింది.. వైకుంఠ ఏకాదశి రోజు దర్శనం చేసుకుంటే జన్మజన్మల పుణ్యమని మనుషుల మెదడులను కండిషన్ చేసిన నమ్మకాలను నిందించాలి.**



దేవుడు ఎప్పుడైనా దేవుడే. మనిషిలో నమ్మకాన్ని సృష్టించి ఆ నమ్మకాలకు మనుషులు బలవుతుంటే పాపం ఆ నమ్మకాలను నమ్మిన మనుషుల్ని నిందిస్తున్నాం చూశారా.. మరి ఆ నమ్మకాలను సృష్టించిన మేధావులు అందరూ ఏం చేస్తున్నారు? వాళ్లకు బాధ్యత లేదా? మనం ఒకరిని నమ్మటం మొదలుపెట్టామంటే పూర్తిగా మన జీవితం మీద అధికారం వారికి ఇచ్చినట్లు. వాళ్లు గుడ్డిగా మన మనసులో ఎలాంటి నమ్మకాన్ని అయినా చొప్పించవచ్చు. మన జనరల్ ఇంటెలిజెన్స్ కోల్పోవడానికి మించిన పాపం ఏదీ లేదు.

మనిషి చేసే మంచి చెడులను బట్టి పుణ్యం వస్తుందని ఒకపక్క చెబుతుంటారు. మరోపక్క వైకుంఠ ఏకాదశి రోజు దర్శనం చేసుకుంటే జన్మజన్మల పుణ్యం వస్తుందని చెబుతుంటారు? రెండింటిలో ఏది ఫాలో అవ్వాలి? ఎప్పుడు మంచి చేయాలా? లేదా షార్ట్‌కట్ మెథడ్‌లో వైకుంఠ ఏకాదశి రోజు దర్శనం చేసుకోవాలా? తిరుపతిలో తొక్కిసలాటకు షార్ట్‌కట్ మెథడ్ కారణం కాదా? ఇలా షార్ట్‌కట్ పుణ్యాలు సృష్టించినప్పుడు ఇంకా ధర్మశాస్త్రాలు ఎందుకు? జనాలు ర్యాంకుల కోసం ఎగబడినట్లు దర్శనాల కోసం ఎగబడతారు. దేవుడా.. 365 రోజులూ.. 360 డిగ్రీల్లో ద్వారాలూ, లోకంలో ఎక్కడ మనసులో దర్శించుకున్నా అదే తృప్తి అని ఎప్పుడు తెల్సుకుంటామో? ఎప్పటికి అద్వైతం అర్థం చేసుకుంటామో?

జగన్ ప్రభుత్వం తెచ్చిన టోకెన్ల సిస్టం వల్ల ప్రమాదం జరిగింది అంట. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలయింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి చైర్మన్‌ను నియమించి రెండు నెలలు అయింది. బుధవారం జరిగిన దుర్ఘటనకు కూడా జగన్ కారణం అన్నట్లు వచ్చిన కథనాలు జుగుప్సాకరం. కొత్త చైర్మన్ బిఆర్ నాయుడు వచ్చిన తర్వాత జగన్ అధికారంలో ఉండగా టీటీడీలో తీసుకున్న అనేక నిర్ణయాలపై సమీక్షించి మార్పులు చేశారు. మరి ఈ టోకెన్ల సిస్టం ఎందుకు మార్చలేదు? మంచి జరిగితే కూటమి ప్రభుత్వం గొప్ప. చెడు జరిగితే జగన్ కారణం అనే మాటలు రాతలు కట్టిపెట్టండి. హైదరాబాద్ సంధ్యా థియేటర్‌లో పుష్ప-2 సినిమా ప్రీమియర్ చూడటానికి వచ్చిన రేవతి తొక్కిసలాటలో చనిపోతే అందుకు అల్లు అర్జున్ బాధ్యుడన్నారు. ఉందో లేదో స్వర్గం, నరకం, ఉన్నా కూడా నా బాల్యం నాకిచ్చెయ్ అంటాడు సినారె. ఒక్కడు చనిపోతే అల్లు అర్జున్ బాధ్యుడైనప్పుడు వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ కోసం క్యూలైన్ తొక్కిసలాటలో చనిపోయిన ఘటనకు ఎవరు బాధ్యులు? సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో రూ.10కోట్లు రేవతి కుటుంబానికి ఇవ్వాలని, వీలైతే భార్య లేని భాస్కరరావుకు పుష్ప హీరోయిన్ శ్రీవల్లిని ఇచ్చి పెళ్లి చేయాలని, ఆసుపత్రిలో ఉన్న రేవతి కొడుక్కి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసినవారు ఒక్కసారి ఇప్పుడు బయటకు వచ్చి చనిపోయినవారికి బాలాజీ ఆదాయంలో 10 శాతం ఇవ్వాలని, రంభనిచ్చి పెళ్లి చేయాలని డిమాండ్ చేస్తే బాగుంటుంది. టీవీ-5లో ప్రతీ చిన్నవిషయానికి అరిచి గీపెట్టే ఆ జర్నలిస్టు ఇప్పుడు తన బాస్ చైర్మన్‌గా ఉన్న టీటీడీ మీద ఏం మాట్లాడతారో చూడాలి.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం డెస్క్

## కోమాలో ఉన్న విద్యార్థినికి 'సిక్కోలు' సాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గుజరాతిపేటకు చెందిన ఎం.అనూష (17)నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో ట్రిపుల్ ఈ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. అయితే ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ప్రస్తుతం విజయవాడ మణిపాల్ వైద్యశాలలో ఐసీయూలో చికిత్స పొందుతోంది. వీరిది నిరుపేద కుటుంబం. కొన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు కొంతమేరకు ఆర్థిక సహాయం చేశారు. పూర్తిగా కోలుకోవటానికి ఇంకొంత సమయం పడుతుందని, వైద్యానికి ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. వైద్యానికి ఇంకా ఆర్థిక సాయం అవసరమని సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితిని సంప్రదించారు. స్పందించిన సంస్థ సభ్యులు దాతలు, మిత్రుల సహకారంతో రూ.11వేలు అనూష కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్నతనంలో పెద్దకష్టం రావటం బాధాకరమని, అమ్మాయి వైద్యఖర్చులకు దాతలు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంచాల సింహాచలం, జరుగుల్ల రామారావు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రావికంటిపేట వేదికగా కబడ్డీ పోటీలు

(సత్యంన్యూస్,ఆమదాలవలస)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరున ప్రతి ఏటా ఆనవాయితీగా జరుపుకొంటున్న జగనన్న సంక్రాంతి సంబరాలు రావికంటిపేట వేదికగా జరుపుతున్నట్టు ఆమదాలవలస నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ వైకాపా నాయకులు, కార్యకర్తలు, జగన్ అభిమానులు ఈ సంబరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10, 11 తేదీల్లో రావికంటిపేట వేదికగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

# నాయుడూ.. సబ్ అచ్చాహై

**- కలిశెట్టిని పేరుపెట్టి పలకరించిన ప్రధాని -**

సత్యంన్యూస్, శ్రీకాకుళం



రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల శంకుస్థాపనకు బుధవారం విశాఖపట్నం విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును పేరుపెట్టి పలకరించారు. ఏయూ గ్రౌండ్స్‌లో సమావేశం ముగిసిన తర్వాత వేదిక మీద నుంచి కిందికి వచ్చిన మోడీకి అక్కడే ఉన్న రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు, సీనియర్ టీడీపీ నాయకుడు కళా వెంకట్రావుతో పాటు ఎంపీ అప్పలనాయుడు అభివాదం చేశారు. ఈ సందర్భంగా మోడీ అప్పలనాయుడు భుజం మీద చెయ్యి వేసి నాయుడు సబ్ అచ్చాహై అంటూ మాట కలిపారు. మొదటిసారిగా ఎంపీ అయిన అప్పలనాయుడు ఢిల్లీ వర్గాల్లో తక్కువ సమయంలో గుర్తింపు పొందారు. లావేరుకు చెందిన లక్ష్మీ, సూర్యనారాయణలు చేనేత వస్త్రం మీద మోడీ చిత్రాన్ని నేశారు. దీన్ని చేనేత దినోత్సవం సందర్భంగా అప్పలనాయుడు ప్రధాని మోడీకి అందజేసి తొలిసారిగా తనను తాను పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత విజయనగరం పైడితల్లి అమ్మవారి ప్రసాదాన్ని మోడీ ఇంటికి వెళ్లి అందించారు. మొన్న జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో మోడీని ముచ్చటగా మూడోసారి కలిశారు. దీన్నే గుర్తుపెట్టుకున్న మోడీ విశాఖపట్నం సభానంతరం అప్పలనాయుడును పలకరించారు.

# 11న శనైశ్చరునికి తైలాభిషేకాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



చిన్నబొందిలీపురం బాయమ్మతోటలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించబడిన జిల్లాలోనే అరుదైన 3 అడుగుల ఎత్తు గల శనైశ్చరునికి అర్చకులు ఈదర వేంకట ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో తైలాభిషేకాలు నిర్వహిస్తున్నట్టు విశ్వజయము గ్రూప్ ద్వారా ఆలయ నిర్వాహకులు కాశిన వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న శనివారం శని త్రయోదశి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి శనిగ్రహ ప్రీత్యర్థం తైలాభిషేకాలు జరుగుతాయని, గోచార రీత్యా అష్టమ శని (కర్కాటకరాశి), అర్థాష్టమ శని (వృశ్చికరాశి, ఏలినాటిశని (మకర రాశి, కుంభరాశి, మీనరాశి) వారు తప్పకుండా ఈ అభిషేకంలో పాల్గొంటే శుభమని శాస్త్రవచనం.

## శర్వాణిలో ముందస్తు 'సంక్రాంతి సంబరాలు'



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి రోడ్డులోని 'శర్వాణి విద్యాలయ'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వాణి సంస్థల అధినేత అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ మన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అచ్చతెలుగు పండుగ సంక్రాంతి అని, కొత్త పంట చేతికందించే రైతన్నల పంటల పండగని అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులు పతంగులను ఎగురవేశారు. ముత్యాలముగ్గులు, ముగ్గుల మధ్య గంగిరెద్దుల సందడి, హరిదాసు వేషధారణ, విద్యార్థులతో ప్రదర్శించిన అనేక నృత్యప్రదర్శనలు, సంప్రదాయబద్ధమైన దుస్తుల అలంకరణ అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో హెడ్మాస్ట్రెస్ డాక్టర్ కె.రేఖ, సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## కస్తూర్బా విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు



(సత్యంన్యూస్, ఎన్.ఎన్.పేట)

లక్ష్మీనర్సుపేట గ్రామంలోని కస్తూర్బా విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి రిబికా, ద్వితీయ బహుమతి నీరజ, తృతీయ బహుమతి సాయి తేజస్వినిలకు లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్, సామాజికవేత్త, దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, చీఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లయన్ డాక్టర్ ఎం.కె.మిశ్రో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మిశ్రో మాట్లాడుతూ సంక్రాంతి విద్యార్థినీ విద్యార్థుల్లో నూతన తేజస్సు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా విద్యాలయం ఎస్‌వో ఎం.వి.అంబికా, ఉపాధ్యాయులు ఉపేంద్ర, సునీత, స్వర్ణ, లక్ష్మీ, ఈశ్వరి, లీల, భవానీ, అరుణ, మాలతి, ధనలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.






Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.